సాక్షి
నారాయణపేట

శనివారం । 14 । అక్టోబర్ । 2023



సరిహద్దులో విస్తృత తనిఖీలు

సరిహద్దు చెక్‌పోస్టుల్లో పోలీసులు తనిఖీలు చేపడుతుండగా నగదు పట్టుబడుతుంది.

వివరాలు IIలో ▸



అట్టహాసంగా జోనల్ క్రీడలు

ఉమ్మడి జిల్లాలోని గురుకులాల్లో జోనల్ పోటీలు అట్టహాసంగా కొనసాగుతున్నాయి.

వివరాలు IVలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.1 /18.8

మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. రాత్రివేళలో చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నూతన ఎస్పీగా యోగేష్‌గౌతమ్



నారాయణపేట రూరల్: జిల్లా నూతన ఎస్పీగా 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన యోగేష్ గౌత్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇది వరకు ఉన్న ఎస్పీ వెంకటేశ్వర్లు ను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీ చేసిన విషయం విధితమే.

గారడీ మాటలు నమ్మొద్దు



మద్దూరు: ఎన్నికల కోసం రేవంత్‌రెడ్డి చేసే గారడీ మాటలు నమ్మకండని, నియోజకవర్గ ప్రజలకు ఈ ఐదేళ్లు ఎల్లవేళలా అందుబాటులో ఉన్నానని, ఉంటానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రతి కార్యకర్త రానున్న 50 రోజుల్లో ప్రజలకు వివరించాలని, అన్ని పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు. మూడో సారి కూడా ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేదిన బొంరాస్‌పేట మండలంలోని మదనపల్లి నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సలీం, వెంకటయ్య, మధుసుధన్‌రెడ్డి, అరుణ, షేక్‌మీరాన్, వెంకట్‌రాములుగౌడ్, వీరారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

లాస్ట్ చాన్స్..



ఓటు నమోదు చేసుకునేందుకు యువతకు అవకాశం

- అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులే
- ఈ నెల 31 వరకు నమోదుకు అవకాశం

మద్దూరు: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. కొద్దిరోజుల్లో ఊరువాడ అభ్యర్థుల ప్రచారం హోరెత్తనుంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిది. ఐదేళ్లకోసారి ఎన్నికల్లో నచ్చిన నేతను ఎన్నుకోవాలంటే ఓటరుగా నమోదు చేసుకోవడం ముఖ్యం. 18 ఏళ్లు నిండిన ప్రతీ పౌరుడికి భారత రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఇప్పటికీ నమోదు చేసుకోనివారి కోసం ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ సారి నమోదు చేసుకోకుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసే చాన్స్ కోల్పోతారు. మళ్లీ ఐదేళ్ల వరకు ఎమ్మెల్యేను ఎన్నుకునే అవకాశం ఉండదు. అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. వచ్చే ఎన్నికల్లో తమ విలువైన ఓటుతో ఎలాంటి నేత కావాలో ఎన్నుకునే ఆయుధాన్ని పొందవచ్చు. ఈ తరుణంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా పేరు నమోదు చేయించుకోవడంతో పాటు ఓటు వేయడం చాలా అవసరమని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకోవడం కీలకం. తీరా పోలింగ్ రోజు జాబితాలో పేరు లేక ఓటింగ్‌కు దూరమవుతున్న వారు లేకపోలేదు. ఈ నేపథ్యంలో ఓటరు జాబితాలో తమ పేరుందో లేదో చూసుకోవాల్సిన అవసరం ఉంది.

యువతకు అవకాశం..

తొలిసారి ఓటరుగా నమోదు చేసుకునే యువత కీలకంగా మారునున్నారు. 18 ఏళ్లు దాటిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. చాలా మంది ఓటు హక్కు నమోదులో నిర్లక్ష్యం వహిస్తూ..తీరా ఓటు వేసే సమయానికి ఓటు లేదని బాధపడుతుంటారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం అనే సంగతి గుర్తుంచుకోవాలి. మీ ఊరు, బస్తీలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా ఓటు వినియోగమే కీలకం. ఓట్ల కోసం వచ్చే నేతలను ఆ హక్కుతో నిలదీసే అవకాశం అందరికీ రాజ్యాంగం కల్పించింది. ఇప్పటికే ఓటరుగా నమోదైనవారంతా జాబితాలో పేరు లేకపోతే ఈ నెల 31లోపు ఓటు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లోనే నమోదు...

18 ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటరు నమోదు కోసం ఈ నెల 31 వరకు అవకాశం కల్పించారు. ఇందుకోసం ఎక్కడికి వెళ్లకుండా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ తీటీటీ.ఛౌఞ్ఛ ౖ ఞజ్చ ఞ. ౩జీఢ.జీ ఽ, కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్ https://www.nvrp.in, https;//voters.eci.gov.in పేర్లను సరి చూసుకోవచ్చు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. సందేహాలుంటే 1950 నంబరుకు ఫోన్ చేసి సూచనలు తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదుకు ఫారం 6ను నింపాలి. లేదా స్థానిక బీఎల్‌ఓలను ఎన్నికల అధికారులను నేరుగా సంప్రదించవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించింది. ఈ ఓటరు నమోదు మాత్రం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఫారం 6ను నింపి స్థానికంగా ఉన్న బీఎల్‌ఓలకు మీరే అందజేయాలి. ఓటరు నమోదు కోసం బీఎల్‌ఓలు మీ దగ్గరకు రారు.

– అనిల్‌కుమార్, తహసీల్దార్, కొత్తపల్లి

పేట, మక్తల్, కొడంగల్‌లో ఓటర్ల వివరాలిలా..

నారాయణపేట జిల్లాలో రెండు నియోజకవర్గాలు మక్తల్, నారాయణపేటలో 4,65,953 మంది ఓటర్లు ఉన్నారు. నారాయణపేట నియోజకవర్గంలో 2,27,367 మంది ఉండగా అందులో పురుషులు 1,12,697 మంది ఓటర్లు, మహిళలు 1,14,668, ఇతరులు 02 ఓటర్లు ఉన్నారు. మక్తల్ నియోజకవర్గంలో 2,38,586 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,17,576, మహిళలు 1,21,009 మంది, ఇతరులు 01 ఉన్నారు. ఇక కొడంగల్ నియోజకవర్గంలో కొడంగల్, కోస్గి, మద్దూరు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు ఉన్నాయి. మొత్తం ఓటర్లు 2,30,251 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,140 మంది, స్త్రీలు 1,16,099 మంది ట్రాన్స్‌జెండర్లు 12 మంది ఉన్నారు.

ఎన్నికల నిబంధనలు అమలు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- విధుల్లో అప్రమత్తతే ముఖ్యం
- కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని రకాల ఎన్‌ఫోర్సమెంట్ బృందాలు ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల కోసం నియమించడిన స్టాటస్టిక్ సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వలెన్స్ బృందాలు, వీడియో వీవింగ్, ఎంసీసీ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అన్ని బృందాలు విధులలో యాక్టీవ్ ఉండాలని, అకౌంటింగ్ బృందంలోని అందరూ అకౌంట్ రిజిస్టర్ల నిర్వహణ, షాడో రిజిస్టర్ నిర్వహణ, అభ్యర్థుల వ్యయం బుక్ చేయడం తదితర అంశాలపై పూర్తి స్థాయిలో చూడాలన్నారు. వీడియో సర్వేలెన్స్ బృందాలతో ఫ్లెయింగ్ సోస్క్వడ్ టీంలు వారి విధులకు సంబంధించిన వీడియోలు అన్నింటిని పరిశీలించి ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.

అనుమతి లేకుండా ప్రచారం చేస్తే చర్యలు

ఎస్ఎస్‌టీవీ ఎస్‌టీ , ఎఫ్ఎస్‌టీ సర్వేలెన్స్ బృందాలు కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లతో పాటు మ్యారేజ్ హాళ్లను సైతం తనిఖీ చేసి అక్కడ ఏమైనా ఎన్నికలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఆ వివరాలను తక్షణమే సమర్పించాలని చెప్పారు. లౌడ్ స్పీకర్లు అనుమతి తీసుకోవాలని రాత్రి 10 గంటల తర్వాత వినిపిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అన్ని బృందాలు వారికి కేటాయించిన పనులను సరైన విధంగా ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రతి అంశానికి సంబంధించి నియమాలను ఎన్నికల నియమావళి పుస్తకంలో రూపొందించడం జరిగిందని, వాటన్నింటిని తూచ తప్పకుండా పాటించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

ఆధారాలు వారంలో అందించాలి

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున రూ.50 వేలు మించి తీసుకువెళ్లే వారు తప్పనిసరిగా ఆధారాలను వెంట తీసుకువెళ్లాలని, లేనట్లయితే సీజ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. డబ్బు పట్టుబడిన వాటికి సంబంధించిన ఆధారాలు వారంలోపు అందజేయాలని, లేనిపక్షంలో ఆదాయపు పన్ను శాఖకు బదిలీ చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రూ. 50 వేల పై బడి నగదు సీజ్ చేసిన అధికారులకు వారంలోపు తగు ఆధారాలు చూపని పక్షంలో ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖకు అప్పగించడం జరుగుతుందని తెలిపారు. నారాయణపేట జిల్లా గ్రీవెన్స్ కమిటిలో జడ్పీ సీఈఓ జ్యోతి, కో ఆపరేటివ్ అధికారి కోదండ రాములు, జిల్లా కోశాధికారి యాదగిరి ఉంటారని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, అశోక్‌కుమార్, ఆర్డీఓ రాంచందర్ నాయక్, ఎస్‌డీసీ రాంజేందర్‌డా, డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ , జిల్లా పరిషత్ ప్రధానోధ్యాయులు, ఉపాధ్యాయులకు సాధారణ ఎన్నికల సందర్భంగా అందరికి దసరా సెలవుల్లో ఎన్నికల శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను ఓడించడమే లక్ష్యం

దేవరకద్ర: రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను ఓడించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని కేంద్ర ఇంధన వనరుల సహాయ మంత్రి భగవత్ కూబ అన్నారు. శుక్రవారం దేవరకద్రలో జరిగిన బీజేపీ కోర్ కమిటీ కీలక సమావేశంలో నాయకులకు దిశానిర్దేశం చేశారు. కుటుంబ పాలనతో ప్రజలపై పెత్తనం చెలాయించే బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను ఓడించడానికి నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. రాబోయే రోజులు చాలా కీలకమని ప్రతి కార్యకర్త అవిశ్రాంతంగా ప్రచారం చేస్తేనే ఇది సాధ్యం అన్నారు. పార్టీ అధిష్టానం సూచించిన మార్గ నిర్దేశనంలో, పార్టీ సిద్ధాంతాలతో త్వరలో సమావేశంలో ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 16న అన్ని స్థాయి కమిటీలతో చర్చించి ప్రచారానికి శ్రీకారం చుడతామన్నారు. అభ్యర్థులు ఎవరైనా ప్రచారానికి సిద్ధం కావాలని, దేవరకద్ర నియోజకవర్గంలో బీజేపీ గెలుపు కోసం ఆశావహులతో పాటు కార్యకర్తలు పెద్దఎత్తున పనిచేయాలని కోరారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల ప్రచార నేపథ్యంలో ప్రణాళికలను అమలు చేసేందుకు కోర్ కమిటీలో చర్చించారు. పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, వీరబ్రహ్మాచారి పాల్గొన్నారు.

భారత్ వందే జగద్గురు పుస్తకావిష్కరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు సూర్యనారాయణ రచించిన భారత్ వందే జగద్గురు పుస్తకాన్ని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యరచనలో 103 కవితలతో, ఆంగ్లంలో ఉన్న సానెట్ బ్లాంకెవెర్స్ వంటి పద్యరూపంలో ఈ పుస్తకాన్ని రాయడం గొప్ప విషయం అన్నారు. భారత్ ప్రపంచ దేశాల్లో కెల్ల గొప్పదని, ప్రపంచంలో భారత్ వసుదైక కుటుంబంగా వెలుగొందాలన్న ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రాయడం గర్వకారణమన్నారు. ప్రిన్సిపల్ పద్మావతి, సత్యభాస్కర్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, ఈశ్వరయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ముదురుతున్న గలాటా..



- కూచుకుళ్ల కుటుంబంపై నాగం ఘాటు వ్యాఖ్యలు
- రెండు వర్గాలుగా కాంగ్రెస్ కార్యక్రమాలు
- కొల్లాపూర్‌లో జూపల్లితో చేయి కలపని జగదీశ్వర్‌రావు
- అంతర్గత కుమ్ములాటలతో గందరగోళంలో పార్టీ శ్రేణులు

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో కొత్త, పాత నేతల మధ్య వైరం మరింత ముదురుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థుల ప్రకటనపై ఉత్కంఠ నెలకొనగా, అదే సమయంలో పార్టీలోని ముఖ్య నేతల మధ్య దూరం మరింత పెరుగుతోంది. ఇటీవల పార్టీలోకి చేరిన నేతలు తమకే టికెట్ వరిస్తుందనే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నేతలు మాటల తూటాలు పేలుస్తున్నారు. గురువారం జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారాయి. పార్టీ అధిష్టానం నుంచి టికెట్ ప్రకటన వెలువడ్డాక ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో అన్నదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

కూచుకుళ్ల కుటుంబంపై నాగం విమర్శనాస్త్రాలు..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై జరుగుతున్న చర్చ నేపథ్యంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో కలసి నాగం జనార్దన్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ వేదికగా ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిపై విమర్శలను సంధించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరకుండానే పార్టీ టికెట్ అడగడాన్ని తప్పుబట్టారు. మళ్లీ తనను ఓడించేందుకే దామోదర్‌రెడ్డి కుమారుడిని పార్టీలోకి పంపారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నుంచి నేతలు, కార్యకర్తలను కాంగ్రెస్‌లో చేర్చాల్సిందిపోయి.. కేవలం కాంగ్రెస్ పార్టీలోనే చీలికలు తెస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో తన అసలు శక్తి చూపుతానని, చక్రం తిప్పుతానంటూ నాగం చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో చర్చకు దారితీస్తున్నాయి.

వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు..

నాగర్‌కర్నూల్‌తో పాటు కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి తమ కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఇటీవల పార్టీలో చేరిన కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పార్టీ అధిష్టానం నిర్దేశించిన కార్యక్రమాలను సైతం ఎవరికి వారే సొంతంగా చేపడుతున్నారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నేతలు జగదీశ్వరరావు, జూపల్లి కృష్ణారావు ఇరువురూ బరిలో ఉంటామని చెబుతుండటంతో అభ్యర్థుల ప్రకటన తర్వాత పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయోనన్న ఆందోళన పార్టీ శ్రేణుల్లో నెలకొంది.

కొల్లాపూర్‌లో ఎవరికి వారే..

కొల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేత చింతలపల్లి జగదీశ్వరరావు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య సఖ్యత పొసగడం లేదు. ఎవరికి వారు తమకే పార్టీ టికెట్ లభిస్తుందన్న ధీమాతో ఉన్నారు. వేర్వేరుగా ప్రజల మధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. పార్టీ టికెట్‌పై సాగుతున్న ప్రచారం నేపథ్యంలో శుక్రవారం జగదీశ్వరరావు స్పందించారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని, తాను ఎన్నికల బరిలో ఉంటున్నట్లు ప్రకటించారు.

● 'కారు'లో కిరికిరి.. 'అలంపూర్'లో అలజడి

మూడు ముక్కలాట!

ఎమ్మెల్యే అబ్రహంపై అసంతృప్త జ్వాలలు

- విభేదాలతో మౌనం పాటిస్తూ వచ్చిన ఎమ్మెల్సీ చల్లా
- తాజాగా వందలాది వాహనాలలో హైదరాబాద్‌కు తరలిన ఆయన వర్గీయులు
- మంత్రి కేటీఆర్‌ను కలిసి అభ్యర్థిని మార్చాలని డిమాండ్
- ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా నియామకమైన మరునాడే ఘటన
- మరోవైపు మాజీ ఎంపీ మందా జగన్నాథం అసమ్మతి రాగం
- గందరగోళంలో 'గులాబీ' శ్రేణులు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్:

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్‌లో అసంతృప్త సెగలు భగ్గుమంటున్నాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య విభేదాలు.. మరో ముఖ్యనేత అసమ్మతి రాగం వెరసి 'కారు'లో కీచులాటలు తారస్థాయికి చేరాయి. శుక్రవారం ప్రగతిభవన్‌కు చేరిన అలంపూర్ పంచాయితీయే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎమ్మెల్యే అబ్రహంకు టికెట్ ఇవ్వొద్దని.. అభ్యర్థిని మార్చాలని వందలాది వాహనాల్లో తరలివెళ్లిన పార్టీ నాయకులు మంత్రి కేటీఆర్‌ను కలిసి ముక్త కంఠంతో డిమాండ్ చేశారు. మరోవైపు గులాబీ సీనియర్ నేత, మాజీ ఎంపీ, ఢిల్లీలో అధికార ప్రతినిధి మందా జగన్నాథం సైతం పార్టీ అభ్యర్థిని మార్చాలని.. తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని బహిరంగంగానే విమర్శలు గుప్పించడం హాట్‌టాపిక్‌గా మారగా.. పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది.

అప్పటి నుంచి పెరిగిన గ్యాప్..

అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు చల్లా వెంకట్రామిరెడ్డిని పార్టీలో చేర్చుకుని.. ఆ వెంటనే ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జోగుళాంబ ఆలయ చైర్మన్, తదితర పరిణామాల క్రమంలో ఎమ్మెల్యే అబ్రహం, ఆయన మధ్య గ్యాప్ బాగా పెరిగింది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తుగానే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటిస్తారనే ప్రచారం ఊపందుకోగా.. ఎమ్మెల్యే అబ్రహంకి కాకుండా ఇతరులకు పార్టీ టికెట్ ఇప్పించేందుకు చల్లా ప్రయత్నించినట్లు సమాచారం. ఉమ్మడి పాలమూరులో సిట్టింగ్ ఎమ్మెల్యేలనే అభ్యర్థులుగా ఖరారు చేస్తూ సీఎం కేసీఆర్ జాబితా ప్రకటించగా.. నియోజకవర్గంలోని పలు మండలాల్లో నాయకులు అబ్రహంకి వ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించారు. వీటి వెనుక ఎమ్మెల్సీ చల్లా హస్తం ఉందని ఎమ్మెల్యే సైతం పరోక్షంగా ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పించారు.

'మందా' సైతం అసమ్మతి గళం..

'అలంపూర్ బీఆర్ఎస్ ఎదగడానికి నాతో పాటు నా కుమారుడు మందా శ్రీనాథ్ కృషి చేశారు.. అయితే కేసీఆర్ మమ్మల్ని విస్మరించారు.. అభ్యర్థిని మార్చకపోతే బీఆర్ఎస్ ఓడిపోతుందని శ్రేణులే చెబుతున్నాయి.. ఇప్పుడు ప్రకటించిన అలంపూర్ అభ్యర్థిని గెలిపించలేం.. ఆయనను మార్చాలన్నదే మా డిమాండ్.. ఎమ్మెల్సీ చల్లాది కూడా అదే డిమాండ్' అని మాజీ ఎంపీ మందా జగన్నాథం బహిరంగంగానే చెబుతున్నారు. 'మందా శ్రీనాథ్‌కు బీఫాం ఇవ్వండి.. చల్లా సహకారం తీసుకుంటాం.. గెలుస్తాం' అని సైతం వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఈ క్రమంలో అలంపూర్ బీఆర్ఎస్‌లో రాజకీయాలు మూడు ముక్కలాటను తలపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

'చల్లా'రుతాయా.. లేక..

ప్రస్తుతం ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగా.. వచ్చే నెల మూడో తేదీన ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. త్వరలో బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాం ఇచ్చేందుకు ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అలంపూర్‌లో చల్లారినట్లే చల్లారిన అసమ్మతి సెగలు మళ్లీ భగ్గుమనడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసమ్మతి నేతలు భేటీకి అలంపూర్‌ను ఎంచుకున్నప్పటికీ.. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లికి మార్చారు. ఎమ్మెల్సీ చల్లా సూచనతోనే సమావేశ వేదికను మార్చినట్లు సమాచారం. సమావేశం అనంతరం అసమ్మతి నేతలు హైదరాబాద్‌కు వెళ్లి అలంపూర్ అభ్యర్థిని మార్చాలని ఏకవాక్య తీర్మానంతో వినతి పత్రం సమర్పించిన క్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ 'మీరు ఏదైతే వినతిపత్రం ఇచ్చారో యథాతథంగా సీఎం కేసీఆర్‌కు అందజేస్తాను. ఇంత పెద్ద సంఖ్యలో వచ్చి మీ మనోభావాలను మీరు స్పష్టంగా చెప్పారు.. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను.. వారు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటారు.' అని వెల్లడించడంపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. అభ్యర్థిని మార్చని పక్షంలో చల్లా నిర్ణయం ఏవిధంగా ఉంటుందోననే చర్చ సైతం రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ఇన్‌చార్జ్‌గా నియామకం.. ఆ మరునాడే..

బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు తర్వాత అలంపూర్‌తో పాటు పాలమూరులోని కల్వకుర్తి తదితర సెగ్మెంట్లలో అసమ్మతి జ్వాలలు ఎగిసిపడ్డాయి. బుజ్జగింపులు, పార్టీలో ప్రాధాన్యం, పదవుల భర్తీ వంటి చర్యలతో అసంతృప్త నేతలకు చెక్ పెట్టే వ్యూహాన్ని పార్టీ పెద్దలు అమలు చేశారు. కొంతకాలం నిశ్శబ్దంగానే ఉన్నప్పటికీ.. అలంపూర్‌లో మళ్లీ అసమ్మతి రాజుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఎన్నికల క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ బీఆర్ఎస్ అధిష్టానం గురువారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. ఆ మరునాడే ఆయన వర్గీయులుగా ముద్రపడిన నేతలు అబ్రహం అభ్యర్థిత్వాన్ని మార్చాలంటూ హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసిన అసమ్మతి నేతలు

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా..

- ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థినులు
- ఉట్టిపడిన తెలంగాణ సంప్రదాయం
- కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలను ఎంపిక చేస్తున్న అధ్యాపకులు



బతుకమ్మలతో పీయూ వీసీ, సిబ్బంది



బతుకమ్మలతో సెల్ఫీ తీసుకుంటున్న విద్యార్థినులు





బతుకమ్మ ఆడుతున్న పాలమూరు యూనివర్సిటీ విద్యార్థినులు

స్టేషన్ మహబూబ్‌నగర్/ మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్లటౌన్: ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు గౌరమ్మ ఉయ్యాలో.. అంటూ వందలాది మంది విద్యార్థినులు బతుకమ్మ, జానపద పాటలకు నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడారు. ఇందుకు జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వేదికైంది. శుక్రవారం కళాశాలలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. బతుకమ్మ వేడుకలతో తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడింది. విద్యార్థినులు కేరింతలు కొడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. అధ్యాపకులు సైతం విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేశ్, శివజ్యోతి, రమేష్‌సాగర్, శ్యాంసుందర్, మణిరత్నం, సంజీవరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

■ జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించగా.. అధ్యాపకురాలు సుభాషిణి, ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని తీసుకువచ్చి కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో ఉంచి బతుకమ్మ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

పేదల బతుకుల్లో వెలుగులు నింపే పండుగ బతుకమ్మ అని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పీయూలో బతుకమ్మ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మ భాగం అని, ఈ పండుగ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులు అందమైన పూలతో అలంకరించిన బతుకమ్మలతో ఆడిపాడారు. అందంగా అలంకరించిన బతుకమ్మలకు అధికారులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి ప్రవీణ, శాంతిప్రియ, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, కిష్టయ్య, రవికుమార్, అర్జున్ పాల్గొన్నారు. ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ నిర్వహించారు.



బతుకమ్మ ఆడుతున్న పీయూ విద్యార్థినులు



జడ్చర్లలో బతుకమ్మలతో ఊరేగింపు..



బతుకమ్మను అలంకరిస్తున్న విద్యార్థిని



బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు



ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో బతుకమ్మలు

క్లుప్తంగా

యువతిపై ఆర్టిజన్ హెల్పర్ అత్యాచారయత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: యువతిపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని బొందపల్లిలో ఈ నెల 10న చోటుచేసుకోగా.. శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బొందపల్లిలో ఓ ఇంట్లో ఆర్టిజన్ హెల్పర్ కరెంట్ బిల్లు ఇచ్చిన అనంతరం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. యువతి కేకలు వేయడంతో స్థానికులు, తల్లిదండ్రులు వచ్చి అతడికి దేహశుద్ధి చేశారు. సంఘటనకు సంబంధించి ఎస్ఐ మహేందర్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: వేగంగా వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని వీరన్నపేట సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి(45)ను కర్ణాటక సంపర్క్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాల లభించలేదని, మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చిన్నంబావి: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెలగొండకి చెందిన వడ్డె బండలయ్య(48) మూడు రోజుల కిందట భార్యతో గొడవ పడి పురుగు మందు తాగాడు. అది గమనించిన స్థానికులు వెంటనే పెబ్బేరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, అబ్బాయి ఉన్నారు.

పోక్సో కేసు నమోదు

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన సద్దాం హుస్సేన్ అదే గ్రామానికి చెందిన బాలికను లైంగిక వేధింపులకు గురిచేసిన ఘటనలో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన బాలికను గురువారం తన వెంట తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయస్థానం రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు.

వ్యవసాయ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మహమూద్

అత్మకూర్: అన్ని రాజకీయ పార్టీలు వ్యవసాయ కార్మికుల డిమాండ్లను పరిష్కరించేలా మేనిఫెస్టోల్లో పొందుపర్చాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకట్రాములు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మహమూద్ కోరారు. శుక్రవారం స్థానిక మార్కెట్‌యార్డులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. 1948 చట్టాన్ని అమలు పర్చాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని, ఉపాధిహామీలో 200 పనిదినాలు కల్పించాలని, కూలీబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించే దళిత సమ్మిట్‌కు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ఆంజనేయులు, జగన్‌మోహన్, ప్రభుదాస్, దేవదాస్, కార్మికులు ఉన్నారు.



రైతుల రాస్తారోకో

గోపాల్‌పేట: వ్యవసాయానికి రోజుకు నాలుగు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని తాడిపర్తి రైతులు శుక్రవారం రహదారిపై బైఠాయించి గంటపాటు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నీరందక పంటలు వాడుముఖం పట్టాయని.. విద్యుత్ కోతలు విధిస్తే ఇంకా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉరేసుకుని యువతి బలవన్మరణం

దోమలపెంట: దోమలపెంటకు చెందిన కలవలకుంట్ల కల్పన (18) శుక్రవారం ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈగలపెంట ఎస్ఐ వీరమల్లు తెలిపిన వివరాల ప్రకారం.. యువతి కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్నట్లు తల్లిదండ్రులు నాగేశ్వరరావు, సరోజ తెలిపారన్నారు. కాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూలీ పని చేసుకుని జీవిస్తున్నారు.



కల్పన (ఫైల్)

భార్య గొంతు నులిమి హత్య చేసిన భర్త

కేటీదొడ్డి: భార్యాభర్తలు గొడవ పడగా.. భార్య గొంతు నులిమి భర్త హత్య చేసినట్లు గ్రామస్తులు కేటీదొడ్డి ఎస్ఐ వెంకటేష్ తెలియజేశారు. వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇర్కిచేడుకి చెందిన నాగేష్ ధరూరు మండలం మన్నాపురానికి చెందిన పవిత్ర(23)తో 3 సంవత్సరాల కిందట వివాహమైంది. గతేడాది నుంచి భార్యతో తరచూ గొడవ పడేవాడు. అయితే పెద్దలు, తల్లిదండ్రులు సర్దిచెప్పి సంసారానికి పంపించేవారు. ఈ క్రమంలో గురువారం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో భార్య గొంతు నులిమి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం సమీపంలోని వాగు వద్ద పడేసి, ఆమెపై చెట్ల కొమ్మలు పడేశాడు. ఆ తర్వాత మీ చెల్లెలు కనిపించడం లేదని పవిత్ర అన్నకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో పవిత్ర కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతంలో వెతికి శుక్రవారం మృతదేహాన్ని గుర్తించారు. వారు ఈ విషయమై కేటీదొడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న గద్వాల డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శ్రీనివాస్, సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. వారికి బాబు, పాప పిల్లలున్నారని తెలియజేశారు.



సంఘటన స్థలానికి చేరుకుని పంచానామా నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ

కారు, నగదు, డీజిల్, పైపు స్వాధీనం

యాడికి: పార్కింగ్ చేసిన లారీల్లో డీజిల్ దొంగతనం చేసే ఇద్దరిని యాడికి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి కారు, నగదు, డీజిల్‌తో పాటు పైపు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణకు చెందినవారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ నెల పదో తేదీ అర్ధరాత్రి యాడికి మండలం రాయలచెరువు, పెద్దపప్పూరు మండలం జోడి ధర్మాపురం వద్ద గల టోల్‌ప్లాజ్ వద్ద నిలిపి ఉన్న నాలుగు లారీల్లో 1,400 లీటర్ల డీజిల్ చోరీ అయ్యింది. ఈ ఘటనలపై లారీడ్రైవర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజిల్ దొంగల కోసం యాడికి ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వేములపాడు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. తాడిపత్రి నుంచి వస్తున్న కారు ఆపకుండా గుత్తి వైపు వేగంగా వెళ్లింది. ఎస్ఐ, పోలీసు సిబ్బంది జీపులో వెంబడించి రాయలచెరువు గ్రామంలో రైల్వే గేటు సమీపాన కారును నిలిపి.. అందులో ఉన్న తెలంగాణ రాష్ట్రం నారాయణ పేట జిల్లా సర్వ మండలం జంగంరెడ్డిపల్లెకు చెందిన రాజేష్ నాయక్, మరికల్ మండలం గాజులయ్య తండాకు చెందిన షెకావత్ కిషన్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. డీజిల్ దొంగలని తేలింది. వారిని అరెస్ట్ చేసి, రూ.85వేల నగదుతో పాటు క్యాన్లలో తీసుకెళ్తున్న 400 లీటర్ల డీజిల్, పైపును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అర్ధరాత్రి అంబులెన్స్‌లో కాన్పు



మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లికి చెందిన గర్భిణి మంగమ్మ గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో ఆమెను ఎక్కించుకున్న తర్వాత బోయిన్‌పల్లి- మిడ్జిల్ మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి సిబ్బంది హేమలత కాన్పు చేశారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిన అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. సమయ పాలనలో సరైన వైద్య సాయం అందించిన 108 సిబ్బంది హేమలత, పైలైట్ గౌస్‌ను అభినందించారు. మంగమ్మకు తోడుగా వచ్చిన సహాయకురాలు అలివేలుకు బిడ్డను అప్పగించారు.

ప్రగతిభవన్ ఆడించినట్లుగా ఆడుతున్న అధికారులు

పోలీస్ వాహనాల్లో డబ్బు తరలుతోంది: మాజీమంత్రి జూపల్లి



మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో అధికార యంత్రాంగం ప్రగతి భవన్ ఆడించినట్టుగానే నడుచుకుంటోందని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారుల తీరుపై శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసుల తీరుపై గతంలోనే డీజీపీని కలసి విజ్ఞప్తి చేసినా, ఆయన సైతం పైవారికి చెప్పాలని వ్యాఖ్యానించినట్లు తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ, స్థానిక ఎమ్మెల్యే మెప్పు కోసమే పని చేస్తున్నారని చెప్పారు. పిటిషన్ ఇచ్చేందుకు వచ్చిన బాధితులపైనా అన్యాయంగా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని ఆరోపించారు. పోలీస్ వాహనాల్లోనే డబ్బు, లిక్కర్ తరలుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దళితబంధు కింద దరఖాస్తులు మాత్రమే తీసుకుని డబ్బులు మంజూరైనట్లుగా మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. గృహలక్ష్మి కింద డబ్బులు ఎన్నికల దాకా కూడా రావని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ.5లక్షలు ఇస్తామని చెప్పారు. మూడెకరాల పథకంలాగే దళితబంధు, బీసీ బంధు కూడా రావని చెప్పారు. ఖాతాల్లోకి డబ్బులు రానివాళ్లంతా ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను కర్ణాటక తరహాలోనే అమలు చేస్తామని పేర్కొన్నారు.

మాదిగల ఎదుగుదల కేసీఆర్‌కు ఇష్టం లేదు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

గోపాల్‌పేట/ బిజినేపల్లి: మాదిగలు ఎదగడం సీఎం కేసీఆర్‌కు ఇష్టం లేదని.. అందువల్లనే మాదిగలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన పాదయాత్రలో భాగంగా గురువారం గోపాల్‌పేటకు చేరుకున్న ఆయన శుక్రవారం పాదయాత్ర ప్రారంభించారు. గోపాల్‌పేట బస్టాండు సమీపంలో మాట్లాడారు. రెడ్లు కేసీఆర్‌ను బెదిరిస్తే వారికి మంత్రి వర్గంలో చోటిచ్చారు.. కానీ, మాదిగ కులానికి చెందిన వారికి ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం కోసం పోరాటం చేసినప్పుడు మాదిగలే అతడిని కాపాడారన్నారు. మాదిగలు ఏ పార్టీ వైపు అయినా ఉండండి.. కానీ, కలిసికట్టుగా సరైన నాయకుడిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దళితబంధు పథకం అని తీసుకువచ్చి ఎంతమందికి న్యాయం చేశారని ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న ఎస్సీ కులాల్లో అర్హులకు కాకుండా ఆర్థికంగా ఉన్నవారికి కేటాయించారని, నిజమైన అర్హులకు అన్యాయం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా మాదిగలు ఏకం కావాలని అందరూ కలిసి ముందుకు వెళ్లి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు గట్టు, రమేష్, సంజీవ్, బాలస్వామి, ప్రకాశ్, ఇస్మాయిల్, బాలు పాల్గొన్నారు.

బిజినేపల్లికి చేరిన పాదయాత్ర

ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర శుక్రవారం వనపర్తి జిల్లా నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలోని బిజినేపల్లి మండలానికి చేరుకుంది. అల్లీపూర్ గేటు నుంచి ప్రారంభమైన పాదయాత్రకు మండలానికి చెందిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. అల్లీపూర్, మమ్మాయిపల్లి, శాయిన్‌పల్లి, మహదేవునిపేట మీదుగా బిజినేపల్లికి చేరుకోగా.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాదయాత్రలో పాల్గొన్న మందకృష్ణ మాదిగను మాజీ మంత్రి జూపల్లి మమ్మాయిపల్లి వద్ద కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ యాత్రతో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఇరువురు ఆకాంక్షించారు.

జూరాల కాల్వలో జారిపడి వృద్ధురాలు మృతి

పెబ్బేరు రూరల్: జూరాల కాల్వ శేరుపల్లి వద్ద వృద్ధురాలి మృతదేహం శుక్రవారం లభ్యమైందని ఎస్ఐ వెంకటస్వామి తెలియజేశారు. పెబ్బేరు పట్టణానికి చెందిన చెన్నమ్మ కుటుంబ సభ్యులు గురువారం పనికి వెళ్లేటప్పుడు ఆమె ఇంట్లోనే ఉంది. వారు పని ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత వృద్ధురాలు ఇంటి వద్ద కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికారు. శుక్రవారం శ్రీరంగాపురం మండలం, శేరుపల్లి శివారులో ప్రధాన రోడ్డు వద్ద జూరాల కాల్వలో చెన్నమ్మ(65) మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆమె సంచిలోని ఫోన్ నంబరు ఆధారంగా వారు కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా.. వారు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. మేము ఇంట్లో లేని సమయంలో ఆమె దుస్తులు ఉతకడానికి వెళ్లి జారి కాల్వలో పడిపోయి ఉంటుందని మృతురాలు కుమారుడు చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలియజేశారు.

సరిహద్దులో విస్తృత తనిఖీలు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న గద్వాల జిల్లా రవాణాశాఖ అధికారులు

అలంపూర్: తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆర్టీఓ పురుషోత్తంరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శీతల్ చౌహాన్, నరసింహస్వామి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. తిరుపతికి చెందిన కిరణ్ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.4.68 లక్షలు పట్టుబడ్డాయి. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వ్యాపారం నిమిత్తం తిరుపతి నుంచి హైదరాబాద్‌కు నగదు తీసుకెళ్తున్నట్లు సమాచారం. వాహన తనిఖీల్లో ఉండవెల్లి ఎస్ఐ బాలరాజు, హెడ్‌కానిస్టేబుళ్లు వీరన్న, ప్రసాద్, కానిస్టేబుళ్లు ముంజునాథనాయుడు, అబ్దుల్‌బాషా ఉన్నారు.

శాంతినగర్‌లో రూ.2.46 లక్షలు..

శాంతినగర్: శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.2,46,400 నగదు పట్టుబడినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. పట్టణ సమీపంలోని జములమ్మ కమాన్ వద్ద మధ్యాహ్న సమయంలో తనిఖీలు నిర్వహిస్తుండగా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న జిల్లెడు దిన్నెకు చెందిన మంగళి వెంకట్రాముడు వద్ద నగదు గుర్తించామని.. ఎలాంటి ఆధారాలు లేనందున సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

గద్వాలలో రూ.1.80 లక్షలు..

గద్వాల క్రైం: జిల్లాకేంద్రంలో శుక్రవారం సాయంత్రం పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. యుక్‌మేందర్‌గౌడ్ మోటారు సైకిల్‌లో రూ.1.80 లక్షలు పట్టుబడ్డాయి. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కాచ్‌వార్‌లో రూ.1.09 లక్షలు..

మక్తల్: మండలంలోని కాచ్‌వార్ దగ్గర ఉన్న టోల్ గేట్ వద్ద వాహనాలను సీఐ రాంలాల్, ఎస్ఐ పర్వతాలు తనిఖీలు చేశారు. రాయచూర్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న బొలెరో వాహనాన్ని తనిఖీ చేయగా కౌకుంట్లకు చెందిన కన్మనూర్ నాగన్న వద్ద రూ.1.09 నగదు పట్టుబడింది. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేశారు.

మాగనూర్‌లో రూ.58,700..

మాగనూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.58,700 నగదు పట్టుబడినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు. కర్ణాటకలోని బళ్లారికి చెందిన లోకనాథ్ నారాయణపేటకు కారులో వెళ్తుండగా తనిఖీ చేశామని.. అందులో నగదు లభ్యమైనట్లు తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు వివరించారు.



మాగనూరులో తనిఖీ చేస్తున్న పోలీసులు

పెబ్బేరులో రూ. లక్ష..

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలో కొల్లాపూర్ వెళ్లే రహదారిపై శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన వంగూరు సాయిరాంరెడ్డి కారులో రూ.లక్ష నగదు పట్టుబడ్డాయి. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్థకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

“సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే.” – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

● బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్‌అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్క డి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన ‘ఊపిరి’ నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయి గూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన ఆస్ట్రల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు ‘సుద్దాల’ పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజా గాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు– జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, ‘మోదుగుపూలు’ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

గద్వాల రూరల్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి శుక్రవారం రాత్రి 7 గంటల వరకు వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరిరూపంలో 116 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,250 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 900 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 4,062 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 849.1 అడుగులు.

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 849.1 అడుగుల వద్ద 78.0365 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2.312, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,560, కేసీ కెనాల్‌కు 337, రేగుమాన్ గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భకేంద్రంలో 9.124 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 18,663 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 188 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

2,110 క్యూసెక్కులు విడుదల

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో జలాశయంలోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 15, భీమా ఫేజ్–2 ద్వారా 815, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.



సమాంతర కాల్వ ద్వారా రామన్‌పాడుకు వస్తున్న నీరు

అట్టహాసంగా జోన్ క్రీడలు ప్రారంభం



మరికల్‌లో మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

- మూడు జిల్లాల నుంచి 935 మంది క్రీడాకారులు హాజరు
- ప్రారంభించిన పేట అదనపు కలెక్టర్ మాయాంక్ మిట్టల్

మరికల్: జోనల్ స్థాయి క్రీడా పోటీలను మరికల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరైన అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, సోషల్ వెల్ఫేర్ సొసైటీ జాయింట్ సెక్రటరీ నిరూప జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అంతకు ముందు నారాయణపేట, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల నుంచి వచ్చిన 935 మంది గురుకుల క్రీడాకారులు అధికారులకు, మార్చ్‌ఫాస్ట్ చేసి అధికారులతో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడా జ్యోతిని వెలిగించి పరుగెత్తారు. పోటీలకు ప్రారంభానికి ముందు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

క్రీడా స్ఫూర్తి ముఖ్యం..

క్రీడాస్ఫూర్తితో ఆడిన వారే భవిష్యత్‌లో రాణిస్తారని అదనపు కలెక్టర్ మిట్టల్, సోషల్ వెల్ఫేర్ సొసైటీ జాయింట్ సెక్రటరీ నిరూప అన్నారు. మూడు జిల్లాల నుంచి వచ్చిన బాలికల ఆత్మవిశ్వాసంతో ఆడి విజయం సాధించాలన్నారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను బయటకు తీసేందుకు జోనల్ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, అథ్లెటిక్, ఇండోర్, బాస్కెట్‌బాల్ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

పోటీల్లో పాల్గొన్న టీంలు

నారాయణపేట జిల్లా ఊట్కూర్, నారాయణపేట, మక్తల్, మరికల్, మద్దూరు, గద్వాల్ జిల్లా నుంచి గట్టు, అలంపూర్, గద్వాల్, మానవపాడ్, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డిగూడెం, జడ్చర్ల గురుకుల పాఠశాల నుంచి 935 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి అండర్–14, 17, 19లో వాలీబాల్, బాల్ బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నీ కాయిట్, క్యారమ్స్, చెస్, లాంగ్ జంప్, హైజంప్, హ్యాడ్‌బాల్‌తో పాటు అథ్లెటిక్ పోటీలు నిర్వహిస్తారు. ఆర్ఎస్ఓ ఫ్లోర్సెన్‌రాణి, దేవసేన, వాణిశ్రీ, అనురాధ, పీఈటీలు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా క్రీడలకు పుట్టినిల్లు

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా క్రీడలకు పుట్టినిల్లు అని డీఈఓ నరహరి అన్నారు. మండలంలోని సోళీపురంలో అండర్–17 రాష్ట్ర స్థాయి 67వ ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. బాలురు 120, బాలికలు 120 మంది పాల్గొంటున్నారని వారిలో ప్రతిభ కనబరిచిన వారిని రెండు జట్లకు గాను 12 మంది చొప్పున మొత్తం 24 మందిని ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో విలియం, శ్యాంప్రసాద్, కుమార్, మన్యం, అనిల్, రవి, దేవేందర్ పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో క్రీడాకారులతో అధికారులు, పీఈటీలు



అచ్చంపేటలో క్రీడాజ్యోతి కాగడాతో నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్

క్రీడలతోపాటు చదువులో రాణించాలి

అచ్చంపేట: విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను జ్యోతి ప్రజలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రీడ నైపుణ్యం వల్ల రాష్ట్ర, జాతీయ స్థాయితో పాటు, ప్రపంచస్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈనెల16 వరకు క్రీడల్లో 13 గురుకుల పాఠశాలలకు చెందిన 1,105 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ తిర్మల్‌రావు, సీఐ అనుదీప్, క్రీడల పరిశీలకుడు హుస్సేన్, ఆర్సీఓ వనజ, ప్రిన్సిపాల్ రాములు, రీజనల్ స్పోర్ట్స్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొననున్న 680 విద్యార్థులు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల వద్ద శుక్రవారం జోనల్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వనపర్తి జిల్లా ఆర్డీఓ పద్మావతి, నోడల్ ఆఫీసర్ శేషు కుమారి ఈ పోటీలను ప్రారంభించారు. క్రీడల్లో 680 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. మొదటి రోజు ఉదయం అథ్లెటిక్స్‌లో భాగంగా మూడు కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఆ తర్వాత వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాట్మింటన్ పోటీలు మొదటి రౌండ్ పూర్తి చేశారు.
రెండోరోజు శనివారం 6 గంటల నుంచి 7గంటల వరకు హైజంప్, లాంగ్ జంప్, షార్ట్ పుట్, డిస్కస్ త్రో, 100, 200, 400 మీటర్ల పరుగు పందెం, మూడు కిలోమీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గోపాల్‌పేటలో విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న నోడల్ ఆఫీసర్ శేషు కుమారి

అడవి తల్లికి భక్తుల సిరి



నవాబుపేట పర్వతాపూర్ అడవిలో వెలిసిన మైసమ్మ దేవాలయంలో భక్తుల సందడి

- మారు మ్రోగనున్న మైసమ్మ నామస్మరణ
- 15 నుంచి దేవీ శరన్నవరాత్రులు

నవాబుపేట: పచ్చని చెట్లు.. దట్టమైన అడవి.. పక్షుల కిలకిల రావాలు... ఆహ్లాదకరమైన వాతావరణం.. ఆపై కోరిన కోరికలు తీర్చే అమ్మలగన్న అమ్మ.. మైసమ్మ. అంతా ఒకే చోట లభించే ప్రత్యేకమైన వాతావరణం ఈ అడవి సొంతం. ఇలాంటి అడవిలో ఈ నెల 15 నుంచి దేవి నామస్మరణతో మారుమ్రోగనుంది. మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అలాగే దసరా సెలవులు కావటంతో భక్తులు కుటుంబ సమేతంగా అడవిలో సేద తీరి దేవీనవరాత్రి ఉత్సవాల్లో పాల్గొననున్నారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడనుంది. కాగా భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి అన్ని సదుపాయలు కల్పించనున్నట్లు దేవాలయ చైర్మన్ కృష్ణయ్య, ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి భక్తులకు రోజూ ఒక ప్రత్యేక రూపంలో అమ్మవారి దర్శనం ఇప్పించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. దసరా ఉత్సవాలు ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి.



నవాబుపేట పర్వతాపూర్ మైసమ్మ అమ్మవారు

- 15న కలశ స్థాపన, గణపతి పూజా, 16న ప్రత్యేక అలంకరణ ప్రారంభం, 17న పుష్పార్చన, 18న ప్రత్యేక అలంకరణ, 19న పంచమి ప్రత్యేక పూజ, ప్రత్యేక దర్శనం, 20న సరస్వతీ పూజ, 21న చండీ హోమం, పూర్ణాహుతి, 22 అయుధ పూజా, 23న శమీ పూజ దసరా ఉత్సవం, మంగళహారతితో కార్యక్రమాలు ముగియనున్నాయి.

రగ్బీ ఫైనల్లో పాలమూరు జట్లు



ఫైనల్‌కు చేరిన బాలికల జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగం రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచాయి. ఈ టోర్నీలో జిల్లా బాల, బాలికల జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలికల విభాగంలో జిల్లా జట్టు హైదరాబాద్, మెదక్, కరీంనగర్, ఖమ్మం జట్లపై గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. అదే విధంగా బాలుర జట్టు నల్గొండ, హైదరాబాద్, మేడ్చల్ జట్లపై విజయాలు సాధించి ఫైనల్‌కు చేరింది. ఉమ్మడి జిల్లా జట్లు ఫైనల్‌కు చేరడంపై మహబూబ్‌నగర్ జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇదే పట్టుదలతో ఫైనల్‌లో రాణించి చాంపియన్లుగా నిలవాలని ఆకాంక్షించారు.